సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 24 । ఏప్రిల్ । 2024


సోషల్ మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం జగన్



ఒకే ఒక్కడు..
ప్రజా సంక్షేమం కోసం..
సువర్ణ పాలన మళ్లీ కొనసాగించడం కోసం..
ప్రజా వంచకుల కుట్రలను తిప్పి కొట్టడం కోసం..
దుష్ట చతుష్టయ దుర్మార్గాల నుంచి
రాష్ట్రాన్ని రక్షించడం కోసం..
నవరత్నాలతో సురక్షిత పాలన
అందించడం కోసం..
విశాఖ విశ్వ వైభవ కీర్తి ప్రతిష్టను
ఇనుమడింపజేయడం కోసం
సమరశంఖం పూరించాడు...
ఒకే ఒక్కడు ఒకవైపు అనుకొని
తోడేళ్లన్నీ ఒక్కటయ్యాయి..
కానీ.. ఆ ఒక్కడికి కోట్ల అడుగులు తోడై జన ప్రభంజనమైంది. బస్సుయాత్రకు మేమంతా సిద్ధం అంటూ ముందుకు నడిచారు.
నియోజకవర్గాలు **మారినా నిలువెత్తు** అభిమానంలో **మాత్రం ఎలాంటి మార్పు లేదు.**
ఎటు చూసినా **జనజాతర కనిపించింది.**


అభిమాన నేత కోసం పీఎం పాలెం స్టేడియం వద్ద జనసందోహం

భీమిలిలో


మా నమ్మకం నువ్వే జగన్


జగనన్న .. మా మద్దతు నీకేనన్నా..


ఉరిమే ఉత్సాహం.. జగనే మా నినాదం

జన జాతర


ఆనందపురం: అభివాదం చేస్తున్న సీఎం జగన్

- మధురవాడ నుంచి తగరపువలస వరకూ సీఎం జగన్ ప్రభంజన యాత్ర
- జాతీయ రహదారికి ఇరువైపులా జయజయధ్వానాలు
- పూలు, హారతులతో స్వాగతం పలికిన మహిళలు
- మళ్లీ మీరే సీఎం కావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు
- విశాఖ జిల్లాలో అట్టహాసంగా ముగిసిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర

సాక్షి, విశాఖపట్నం : **భీమిలి నియోజకవర్గంలో మంగళవారం** సాగిన **ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్** రెడ్డి మేమంతా సిద్ధం **బస్సుయాత్రకు ప్రజలు బ్రహ్మ**రథం పట్టారు. రాత్రి **బస చేసిన ఎండాడలోని ఎం**వీవీ సిటీ నుంచి **ఉదయం 10 గంటలకు సీఎం** వైఎస్ జగన్ బస్సు **యాత్ర ప్రారంభమైంది. మన**సున్న జననేతను **చూసేందుకు బస చేసిన ప్రాంతా**నికి అభిమానులు, ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. కారుషెడ్ మీదుగా మధురవాడ, కొమ్మాది, మారికవలస, పరదేశిపాలెం, బోయపాలెం, ఆనందపురం, తగరపువలస మీదుగా బస్సుయాత్ర సాగింది. ఈ నెల 19న ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రవేశించిన సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర దిగ్విజయంగా విశాఖలో ముగిసింది.


ఆనందపురం వద్ద అభిమానుల ఆనంద హేల


పీఎంపాలెం: దారిపొడవునా జేజేలు

అడుగడుగునా అదే ఆదరణ

మంగళవారం ఉదయం యాత్ర ఆరంభం నుంచి ప్రతి చోటా జనం నీరాజనాలు పలికారు. మండుటెండను లెక్కచేయకుండా చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ యాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి, పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు బస్సులో కూర్చున్నారు. మధురవాడ క్రికెట్ స్టేడియం వద్దకు వచ్చేసరికి వేలాది మంది **మహిళలు బస్సు యాత్రలో ఉన్న** జగన్‌మోహన్ **రెడ్డికి హారతులు పట్టారు. మధుర**వాడ, కొమ్మాది, **మారికవలస జంక్షన్లలో వేలాది** మంది సీఎం జగ**న్‌ను చూసేందుకు రోడ్లకు ఇరువైపు**లా బారులు **తీరారు. మారికవలస దగ్గర అభిమా**నులు జగన్‌పై పూలవర్షం కురిపించారు. దారిపొడవునా జై జగనన్న నినాదాలతో యాత్ర వెంబడి సాగారు. పరదేశిపాలెం, బోయపాలెం వద్దకు మహిళలు తమ సంక్షేమ ప్రదాతను చూసేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆనందపురం దగ్గర హైవే అండర్ పాసేజ్ వేలాది మంది ప్రజలు, పార్టీ శ్రేణులతో కిక్కిరిసిపోయింది. బస్సు పైకెక్కి ప్రజలకు సీఎం జగన్ అభివాదం చేశారు.


కారణజన్ముడు నీవి జగనన్నా.. ప్లకార్డుల ప్రదర్శన

సోషల్ మీడియాతో ముఖాముఖి

ఆనందపురంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్క అభిమానికీ ఆత్మీయ అభివాదం చేసిన తర్వాత.. అక్కడి నుంచి బయల్దేరి పెద్దపల్లిలోని చెన్నా కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా కుటుంబానికి సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. అక్కడి నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు బయల్దేరారు. సీఎం వైఎస్ జగన్‌ను చూడటానికి దారిపొడవునా అభిమానులు వేచి చూశారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తున్నందుకు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ పలుచోట్ల ప్లకార్డులతో స్వాగతం పలికారు. పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలతో ర్యాలీగా వచ్చి బస్సు యాత్రలో పాల్గొన్నారు. అనంతరం తగరపువలస, మహరాజుపేట మీదుగా రాజాపులోవ వద్ద విజయనగరం జిల్లాలోకి సీఎం సిద్ధం బస్సుయాత్ర ప్రవేశించింది. బస్సుయాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. బస చేసిన ప్రాంతంలో సీఎం జగన్‌ను మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎంపీ, తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యనాయకులు కలిశారు.

న్యూస్‌రీల్

కిడ్నీ బాధితుడికి సీఎం జగన్ భరోసా


సీఎం జగన్‌ను కలవడానికి ఎండాడ వచ్చిన దుర్గారెడ్డి దంపతులు

మధురవాడ: శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన కిడ్నీ బాధితుడికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా ఎండాడలో బస చేసిన ఆయన్ని మంగళవారం పిలక దుర్గారెడ్డి దంపతులు కలిశారు. ఈ సందర్భంగా దుర్గారెడ్డి మాట్లాడుతూ తనకు కిడ్నీ మార్పిడి జరిగిందని, నెలకు రూ.10వేల వరకు మందులకు ఖర్చు అవుతోందన్నారు. చేయడానికి పని కూడా లేదని, దీంతో మందుల ఖర్చు, కుటుంబ పోషణ కష్టమవుతోందన్నారు. సాయం చేయాలని కోరారు. వెంటనే సీఎం జగన్ స్పందించి.. సాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. దీంతో దుర్గారెడ్డి దంపతులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీలో నియామకాలు

దాబాగార్డెన్స్/సీతంపేట: ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ జిల్లా బీసీ కమిటీ అధ్యక్షుడిగా దక్షిణ నియోజకవర్గానికి చెందిన సకలాభక్తుల ప్రసాదరావు నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వీహెచ్ గంగరాజును నియమించారు. జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శులుగా రీసు అనూరాధ(దక్షిణ), సందక రత్నం(తూర్పు), కార్యదర్శులుగా వాసుపల్లి మసీస్(ఉత్తర), పిల్లా సత్యవతి(తూర్పు) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

26 నుంచి వేసవి శిక్షణ శిబిరం

బీచ్ రోడ్డు : ఈ నెల 26 నుంచి మే 31వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు వైఎంసీఏ కార్యదర్శి స్టీవెన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్ గన్, రైఫిల్ షూటింగ్, చెస్, క్రికెట్, డ్యాన్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, కరాటే, సంగీతం, స్కేటింగ్, టేబుల్ టెన్నిస్, యోగా, తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. 5 నుంచి 17 ఏళ్ల మధ్య వయసు గల బాల, బాలికలకు నిపుణులతో శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి వివరాల కోసం 0891-2755826లో సంప్రదించాలన్నారు.

ఎంపీకి 3, అసెంబ్లీకి 18 నామినేషన్లు

మహారాణిపేట: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 18 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆరో రోజు మంగళవారం 18 మంది అభ్యర్థులు 23 సెట్లను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. భీమిలి నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా చొప్పల్లి శరవణ్ గణేష్, బావిశెట్టి రమణబాబు తమ నామినేషన్లను ఆర్వోకి సమర్పించారు. విశాఖ తూర్పులో స్వతంత్ర అభ్యర్థులుగా శివరామకృష్ణ అనగాని, డాక్టర్ మాతే సురేష్ ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వో కె.మయూర్ అశోక్‌కు అందజేశారు. విశాఖ దక్షిణలో జె.బిపిన్ కుమార్ జైన్ ఓ సెట్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరఫున వాసుపల్లి సంతోష్ కుమార్ రెండు సెట్లను దాఖలు చేశారు. విశాఖ ఉత్తరలో బీజేపీ తరఫున పెనుమత్స విష్ణుకుమార్‌రాజు రెండు సెట్లు, పెనుమత్స శ్యామలా దీపిక అదే పార్టీ నుంచి రెండు సెట్లను ఆర్వోకి సమర్పించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి వి.వి.ఎస్.కమలాకరరావు ఓ సెట్, రామారావు లక్కరాజు రెండు సెట్ల నామినేషన్లు, బహుజన సమాజ్ పార్టీ నుంచి పెద్దాడ కనక మహాలక్ష్మి ఓ సెట్‌ను ఆర్వోకి అందించారు. విశాఖ పశ్చిమలో రవికుమార్ వెలగాడ సమాజ్‌వాదీ పార్టీ నుంచి, బహుజన సమాజ్ పార్టీ నుంచి అతుకుంశెట్టి రామచంద్రరావు, స్వతంత్ర అభ్యర్థిగా మండపాటి శ్రీనివాసరాజు తమ నామినేషన్ పత్రాలను ఆర్వోకి సమర్పించారు. గాజువాకలో సీపీఐ(ఎం) పార్టీ నుంచి మైలవరపు రాంబాబు, స్వతంత్ర అభ్యర్థిగా సీమకుర్తి శ్రీనివాసరావు నామినేషన్ వేశారు. పెందుర్తి నియోజకవర్గంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి పిరిడి భగత్ రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా పొన్నాడ అప్పలనాయుడు ఓ సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

విశాఖ ఎంపీ స్థానానికి మూడు నామినేషన్లు

విశాఖ పార్లమెంట్ స్థానానికి ఆరో రోజు మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. నవతరం పార్టీ నుంచి గండికోట రాజేశ్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి పులుసు సత్యనారాయణ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థినిగా మల్ల శ్రావణి నామినేషన్లు వేశారు. ఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి ఎ.మల్లికార్జున తన కార్యాలయంలో వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. అలాగే ప్రజాశాంతి పార్టీ నుంచి కిలారి ఆనంద్ పాల్ మంగళవారం రెండో సెట్ పత్రాలను ఆర్వోకు అందజేశారు.

శతశాతం ఓటింగ్ లక్ష్యం

- ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామ్యం కండి
- ఓటర్లకు కలెక్టర్ మల్లికార్జున పిలుపు



మహారాణిపేట: పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు అతిశక్తివంతమైనదని, ఓటు హక్కును వినియోగించుకుని ప్రథమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు. మే 13న జరిగే ఎన్నికల పండగలో ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. శతశాతం ఓటింగే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ఓటరు చైతన్యం, ఓటు ప్రాముఖ్యం, వినియోగం, హోం ఓటింగ్ విధానం, పోలింగ్ స్టేషన్ల వద్ద కల్పించిన వసతులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అంశాలపై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో తొలిసారిగా ఓటు పొందిన 18-19 ఏళ్ల మధ్య గల యువత సుమారు 60 వేల మంది ఉన్నారని, వారంతా తమ ఓటు హక్కు వినియోగంలో ఉత్సాహం కనబరచాలన్నారు. యువశక్తిదే నిర్ణయాత్మకమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామ్యం కావాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 1991 పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, తాగునీరు, వైద్య సిబ్బంది తదితర వసతులు కల్పిస్తామన్నారు. జీవీఎంసీ పరిధిలో సాధారణ పౌరుల అవసరాలను గుర్తించి చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో కోడ్ అమల్లోకి వచ్చిన రోజు నుంచి అప్రమత్తంగా ఉన్నామని.. పటిష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు జరిగిన 58 ఘటనల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, 68 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. కోడ్ అమలుకు 110 బృందాలను నియమించామని, వస్తు, ధన రూపంలో ఇప్పటి వరకు రూ.5.03 కోట్లను జప్తు చేశామన్నారు. ఓటర్లను చైతన్యం కల్పించేందుకు వీలుగా అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని, మేధావులతో చర్చలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ చెప్పారు. డీఐపీఆర్వో ఎస్.వి.రమణ, డివిజనల్ పీఆర్వో డి.నారాయణరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెట్రోల్ కూపన్ల పేరిట ప్రలోభాలు పెడితే చర్యలు

జేసీ మయూర్ అశోక్ హెచ్చరిక

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్లకు పెట్రోల్, డీజిల్ కూపన్లు పంపిణీ చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందని, ఈ చర్య ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అటువంటి చర్యలకు పాల్పడవద్దని మంగళవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు జారీ చేసిన కూపన్లపై వాహనాల్లో పెట్రోల్, డీజిల్ కొట్టినట్లు తనిఖీల్లో తేలితే.. ఆ పెట్రోల్ బంకు యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రలోభాలకు తెర తీసి..

- టీడీపీ, జనసేన అభ్యర్థుల బరితెగింపు
- పురుషులకు మద్యం బాటిళ్లు.. మహిళలకు తాయిలాలు
- పశ్చిమలో ఆర్పీలకు బంగారు నల్లపూసల పంపిణీ
- పెందుర్తిలో ఏరులై పారుతున్న మద్యం
- ప్రచారానికి వచ్చే వారికి క్వార్టర్ బాటిల్, రూ.400
- భీమిలిలో రూ.లక్షలు పెట్టి పక్క పార్టీ నేతల కొనుగోలు
- మహిళలకు చీరల పంపిణీకి సన్నాహాలు

విశాఖ సిటీ: టీడీపీ, జనసేన నేతలు బరి తెగించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రలోభాలకు తెర లేపారు. ఓటర్ల కొనుగోలుకు ఇష్టానుసారంగా డబ్బు వెదజల్లుతున్నారు. మద్యం ఏరులై పారిస్తున్నారు. నామినేషన పర్వానికి, ప్రచార ఆర్భాటాలకే రూ.కోట్లు కుమ్మరిస్తున్నారు. భారీ జన సమీకరణ ద్వారా ప్రజల్లో తమకు బలం ఉందని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించేందుకు కిందా మీదా పడుతున్నారు. ఇందుకోసం ఎంత ఖర్చుకైనా వెనుకాడడం లేదు. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో తరహాలో ఓటర్లను ప్రలోభపెడుతున్నారు. ఈసారి కేవలం డబ్బు, చీరలు, మద్యం మాత్రమే కాకుండా బంగారం పంపిణీకి కూడా శ్రీకారం చుట్టారు.

పశ్చిమలో ఆర్పీలకు బంగారు నల్లపూసలు

సాధారణ సమయంలో పైసా కూడా తియ్యని పశ్చిమ టీడీపీ ఎమ్మెల్యే గణబాబు ఎన్నికలకు ముందు మాత్రం ఓటర్లపై రూ.కోట్లు కుమ్మరిస్తున్నారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. చీరలు, మద్యంతో పాటు ఈసారి ఏకంగా బంగారు నల్లపూసలు పంపిణీకి పూనుకున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో డ్వాక్రా మహిళలను మభ్య పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఆర్పీలకు భారీగా తాయిలాలు ఇస్తున్నారు. తద్వారా గ్రూపుల్లో ఉన్న వారందరినీ తమ వైపునకు తిప్పుకోవాలని భావిస్తున్నారు. ఇందుకోసం ఆర్పీలకు బంగారు కాసులు ఉన్న నల్లపూసల దండలను పంపిణీ చేస్తున్నారు. అది కూడా ఒక్కో ఆర్పీని అభ్యర్థి ఇంటికే పిలిపించి మరీ అందజేస్తుండడం గమనార్హం. అలాగే గ్రూపులో మహిళలకు చీరలు పంపిణీకి కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఇప్పటికే ప్రచారాలకు వస్తున్న ఒక్కొక్కరికి రూ.300, ఓ బిర్యానీ ప్యాకెట్ పంపిణీ చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ భారీస్థాయిలో తాయిలాలు పంచిపెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.


పశ్చిమ నియోజకవర్గంలో ఆర్పీలకు అందించిన బంగారు నల్లపూసల దండ

పెందుర్తిలో ఏరులై పారుతున్న మద్యం

పెందుర్తి నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు కూడా విచ్చల విడిగా డబ్బు ఖర్చు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రచారాలకు, నామినేషన్ దాఖలకు భారీగా ఖర్చు చేసినట్లు ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. ప్రచారానికి వచ్చే ఒక్కొక్కరికీ రూ.400, మద్యం పంపిణీ చేస్తున్నారు. మహిళలకు పెద్ద ఎత్తున చీరలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే టీడీపీ నాయకులకు గానీ, సొంత పార్టీ వారికి గానీ ఇప్పటి వరకు పంచకర్ల ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. స్థానిక నాయకులను పక్కన పెట్టి కేవలం ఓటర్లను ప్రలోభపెట్టే విషయంపైనే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో ఓటుకు రూ.2వేలు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు జనసేన వర్గాలే బహిరంగంగా చెబుతున్నాయి. ఇలా దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు డబ్బు, మద్యం, ఇతర తాయిలాలతో ఓటర్లను ప్రలోభపెట్టే పనిలో నిమగ్నమయ్యారు.

భీమిలిలో రూ.కోట్లు కుమ్మరిస్తున్న గంటా

భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు రూ.కోట్లు కుమ్మరిస్తున్నారు. ముందుగానే పక్క పార్టీల్లో ఉన్న వారిని కొనుగోలు చేయడంపైనే దృష్టి సారించారు. ఎటువంటి ప్రజాదరణ లేని వారికి రూ.లక్షలకు లక్షలు ముట్టజెప్పి కొనుగోలు చేస్తున్నారు. చేరికల పేరుతో హడావిడి చేస్తున్నారు. సర్పంచ్‌కు రూ.5 లక్షలు, ఎంపీటీసీలకు రూ.10లక్షలు, ఎంపీపీ, జెడ్పీటీసీలకు రూ.25 లక్షలు నుంచి రూ.50 లక్షలు ఆశ చూపిస్తున్నారు. అయితే టీడీపీలో ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులకు మాత్రం పైసా కూడా విదల్చడం లేదు. దీంతో వారు తీవ్ర అసంతృప్తితో గంటాపై గుర్రుగా ఉన్నారు. అలాగే ఓటర్లను ప్రలోభపెట్టేందుకు గంటా తనదైన ఎలక్షనీరింగ్‌కు తెరలేపుతున్నారు. మహిళలకు చీరలు, పురుషులకు భారీగా మద్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికలకు వారం రోజుల నుంచి ఒక్కో ఓటును రూ.2 వేలు నుంచి రూ.3 వేలుకు ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి నిధుల సమీకరణపై దృష్టి పెట్టినట్లు పార్టీ నేతలు చెవులు కొరుక్కుంటున్నారు. గంటా శ్రీనివాసరావు ఇప్పటివరకు ఓసారి పోటీ చేసిన నియోజకవర్గంలో మరోసారి పోటీ చేయలేదు. కానీ భీమిలిలో రెండోసారి పోటీకి దిగారు. ఈ నేపథ్యంలో గంటా వ్యవహార శైలి తెలిసిన ఆ నియోజకవర్గ ప్రజలు ఆయన్ని తిరస్కరించే అవకాశాలు ఉన్నాయని టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు. దీంతో కేవలం డబ్బుతోనే ఓటర్లను కొనుగోలు చేసి విజయం సాధించాలని గంటా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

ఎక్కువ సీట్లిచ్చిన సీఎం జగన్‌కే కాపుల మద్దతు

- కాపుల ఆత్మీయ సమావేశంలో నిర్ణయించాం
- వైఎస్సార్‌సీపీ కాపులకు 31 ఎమ్మెల్యే, 5 ఎంపీ సీట్లు ఇచ్చింది
- సీఎం జగన్‌తో కాపు జేఏసీ భేటీ

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో కాపులకు అధిక సీట్లు ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే తమ మద్దతు ప్రకటిస్తున్నామని రాష్ట్ర కాపు జేఏసీ కన్వీనర్ తోట రాజీవ్ పేర్కొన్నారు. మంగళవారం ఎండాడ ఎంవీవీ సిటీ నైట్ స్టే పాయింట్ వద్ద కాపు జేఏసీ, విశాఖ జిల్లా కాపు ముఖ్య నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ అయ్యారు. వైఎస్సార్‌సీపీకే కాపుల పూర్తి మద్దతు అని తెలియజేశారు. అనంతరం తోట రాజీవ్ మీడియాతో మాట్లాడుతూ.. ఫిబ్రవరి నెలలో విశాఖలో రాష్ట్ర వ్యాప్త కాపుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి కాపులకు ఏ పార్టీ ఎక్కువ సీట్లు కేటాయిస్తుందో ఆ పార్టీకే మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కాపులకు ప్రాధాన్యత ఇచ్చి 31 ఎమ్మెల్యే సీట్లు, 5 ఎంపీ టికెట్లు సీట్లు కేటాయించి.. అన్ని పార్టీల కన్నా అత్యధిక సీట్లు కాపులకు ఇచ్చారని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఒక వ్యక్తిని బూచిగా చూపిస్తూ యావత్ కాపు జాతిని సర్వనాశనం చేయడానికి కంకణం కట్టుకున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాపు జాతి తరఫున పోటీ చేస్తున్న వారిని గెలిపించి కాపు ఎమ్మెల్యే, ఎంపీల సంఖ్యను మరింత పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు ముత్యాల రామదాసు, రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు, తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ తెలగారెడ్డి పుల్లయ్య నాయుడు, గాజువాక కాపునాడు సలహాదారు సాదల శ్రీనివాసరావు, గాజువాక కాపునాడు ప్రధాన కార్యదర్శి మోటూరు సత్యారావు, కాపునాడు నాయకులు సీఎం జగన్‌తో భేటీ అయిన వారిలో ఉన్నారు.

అప్పన్న ఉంగరం చోరీ

- సింహగిరిపై ఘనంగా మృగయోత్సవం
- అశ్వవాహనంపై కనువిందు చేసిన వరాహ లక్ష్మీ నృసింహ స్వామి
- నేడు వినోదోత్సవం


దారిదోపిడీకి పాల్పడుతున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులను నిలువరిస్తున్న అర్చకుడు

సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆరో రోజు మంగళవారం రాత్రి సింహగిరి మాడ వీధుల్లో మృగయోత్సవం (దొంగలదోపు) ఉత్సవాన్ని విశేషంగా నిర్వహించారు.

ఉత్సవం సాగిందిలా...

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి రాజాయాలంకారం చేసి అశ్వవాహనంపైన, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పల్లకీలోను, తిరుమంగై ఆళ్వారును వేరొక పల్లకీలో ఉంచి సింహగిరి మాడ వీధుల్లో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు. నీలుడిగాను, అతన్ని పట్టుకునేందుకు స్వామి దూతగాను అర్చకులు మాడ వీధుల్లో ఉత్సవం జరిగింది. దారిదోపిడీ ఘట్టాలను కళ్లకు కట్టేలా అర్చకులు అభినయించారు. స్వామికి, అమ్మవార్లకు, తిరుమంగై ఆళ్వారుకు విశేష పూజలు చేపట్టారు. స్వామివారి ఉంగరాన్ని వెతుక్కునే ఘట్టాన్ని బుధవారం ఉదయం వినోదోత్సవంగా నిర్వహించనున్నారు.

నేత్రపర్వం.. వసంతోత్సవం

సింహాచలం: సింహగిరి వర్ణశోభితమైంది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానాలను వైభవంగా జరిపించారు. ఉదయం 6.30 గంటలకు కార్యక్రమాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ముందుగా స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను, చక్రపెరుమాళ్ల, ఆళ్వారులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. పసుపుకొమ్ములను దంచి కొట్నాలు సేవ జరిపించారు. వసంతాలను ఉత్సవమూర్తుల వద్ద ఉంచి పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆలయ బేడా ప్రదక్షిణ చేసి, అంతరాలయంలో ఉన్న స్వామివారి మూల విరాట్‌కి, ఆలయంలో కొలువు దీరిన దేవతా మూర్తులకు ఆ వసంతాలను సమర్పించారు. అక్కడి నుంచి వసంతాలను మళ్లీ కల్యాణ మండపానికి ప్రదక్షిణగా తీసుకొచ్చి ఉత్సవమూర్తులకు సమర్పించారు. అనంతరం ఆ వసంతాలను అర్చకులు భక్తులపై చల్లారు. తదుపరి అర్చకులు, సిబ్బంది, భక్తులు వసంతాలను ఒకరిపై ఒకరు జల్లుకుని సందడి చేశారు.

గంగధార వద్ద చక్రస్నానం

ఉత్సవమూర్తులను ఒక పల్లకీలో, చక్రపెరుమాళ్ల, ఆళ్వారులను మరో పల్లకీలో గంగధార వద్దకు తిరువీధిగా తీసుకెళ్లారు. అక్కడ గంగధార, పంచామృతాలతో పంచ కలశ స్నపనం నిర్వహించారు. చక్రస్నానాన్ని ఘనంగా నిర్వహించారు. చక్రపెరుమాళ్లను గంగధార నీటి ప్రవాహం వద్ద ఉంచి ఆ నీటిని భక్తులపై పడేలా చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్నానమాచరించారు. తదుపరి ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ చేసి ఆలయంలో తిరువీధి నిర్వహించారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేదపండితులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు పాల్గొన్నారు.


దారి దోపిడీకి పాల్పడుతున్న నీలుడు వేషధారణలో పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు



కొట్నాలు ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు


గంగధార వద్ద చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

హన్నన్నా.. అయ్యన్నా!

స్వార్థమే పరమావధి

- నాన్ లోకల్ నాడు వద్దు.. నేడు ముద్దు
- స్థానికేతరుడన్న నెపంతో బైరా దిలీప్‌పై వ్యతిరేకత
- అదే స్థానంలో కడప జిల్లా వాసి సి.ఎం.రమేష్‌తో చెట్టాపట్టాలు
- పెందుర్తిలో తరిమేసిన బండారుకు మాడుగుల సీటుపై స్థానిక నేతల్లో అసంతృప్తి
- మచిలీపట్నానికి చెందిన పంచకర్లకు పెందుర్తి టికెట్ ఇవ్వడంపై కినుక
- భస్మాసుర హస్తంలా పరిణమించిన అయ్యన్న నాన్ లోకల్ వ్యతిరేక నినాదం



విశాఖ సిటీ: నాన్ లోకల్ అంశం అనకాపల్లి తెలుగుదేశానికి శరాఘాతంగా మారింది. స్థానికేతరులను జిల్లా నుంచి తరిమికొట్టాలని అయ్యన్నపాత్రుడు ఇచ్చిన పిలుపే.. ఇపుడు ఆ పార్టీని భస్మాసుర హస్తంలా వెంటాడుతోంది. కూటమి తరఫున ఎంపీతో పాటు రెండు ఎమ్మెల్యే స్థానాలను స్థానికేతరులకే కేటాయించడం టీడీపీ శ్రేణులకు మింగుపడడం లేదు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన స్థానిక నేతలకు మొండిచెయ్యి చూపించి.. ఆర్థిక నేరగాళ్లు, జనామోదం లేని నాన్‌లోకల్స్‌కు టికెట్లు కట్టబెట్టడంతో ఆ పార్టీ ఆశావహులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ప్యాకేజీలు పుచ్చుకొని, తమ స్వార్థానికి పార్టీ ప్రయోజనాలను బలి చేస్తున్నారని, కింది స్థాయి క్యాడర్‌కు అన్యాయం చేస్తున్నారన్న ఆవేదన వ్యక్తమవుతోంది. అయ్యన్న నాన్ లోకల్ బాణం తిరిగి తిరిగి తమ పార్టీకే తగులుతోందని టీడీపీ శ్రేణులు ఆందోళన పడుతున్నాయి.

బైరాపై స్థానికేతర ముద్ర

అనకాపల్లి ఎంపీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ నాయకుడు బైరా దిలీప్ చక్రవర్తి ఆశించారు. చంద్రబాబు కూడా ప్రారంభంలో బైరా వైపే మొగ్గు చూపారు. అయితే ఈ స్థానం తన కుమారుడికి కేటాయించాలని అయ్యన్నపాత్రుడు గట్టిగా పట్టుబట్టారు. చంద్రబాబు సమక్షంలో జరిగిన బహిరంగ సమావేశంలోనే ఈ ప్రస్తావన తీసుకువచ్చారు. అనకాపల్లి ఎంపీ స్థానాన్ని తన కుమారుడికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బైరా దిలీప్ స్థానికేతరుడని, అతడిని అనకాపల్లి జిల్లావాసులు ఆదరించరని బహిరంగంగానే విమర్శలు చేశారు. అంతటితో ఆగకుండా స్థానికేతరులను జిల్లా నుంచి తరిమికొట్టాలని ప్రజలకు పిలుపిచ్చారు. పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ స్థానం బీజేపీ వశమైంది. బీజేపీ నుంచి కడప జిల్లా వాసి సి.ఎం.రమేష్ ఎన్నికల బరిలో దిగారు. స్థానికేతరుడన్న నెపంతో బైరాను వ్యతిరేకించిన అయ్యన్న.. నాన్ లోకల్ అయిన సి.ఎం.రమేష్‌తో రాసుకు పూసుకొని తిరగడం టీడీపీ నేతలకు మింగుడుపడడం లేదు. ఆర్థిక నేరగాడిగా ముద్ర పడిన సి.ఎం.రమేష్‌తో సన్నిహితంగా మెలుగుతుండడంతో ద్వితీయ శ్రేణి నాయకులు సైతం అయోమయానికి గురవుతున్నారు. ఈ దోస్తీ వెనుక 'భారీ' వ్యవహారమే నడిచిందన్న చర్చ ఆ పార్టీలో జరుగుతోంది.

రెండు అసెంబ్లీ స్థానాల్లో స్థానికేతరులే..

అనకాపల్లి ఎంపీ అభ్యర్థి స్థానికేతర అంశం ప్రజల్లోకి వెళ్లకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో కిందామీద పడుతున్న టీడీపీ నాయకులకు.. మరో రెండు అసెంబ్లీ స్థానాలను సైతం స్థానికేతరులకే కేటాయించడం మరింత తలనొప్పిగా మారింది. 2019 ఎన్నికల్లో పెందుర్తిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అదీప్‌రాజ్ చేతుల్లో ఓడిపోయిన బండారు సత్యనారాయణమూర్తికి ఈసారి కూడా ఐవీఆర్‌ఎస్ సర్వేలో ప్రతికూలంగా రిపోర్టు రావడంతో చంద్రబాబు అతడికి టికెట్ నిరాకరించారు. ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. దీంతో బండారు అలకపాన్పు ఎక్కారు. ఈ క్రమంలో సి.ఎం.రమేష్ బండారుతో చర్చలు జరిపి చంద్రబాబుతో రహస్య భేటీ ఏర్పాటు చేయించి మాడుగుల టికెట్ వచ్చేలా చక్రం తిప్పారు. దీంతో స్థానికులైన గడిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాద్‌లను పక్కనపెట్టి పెందుర్తిలో తరిమేసిన మరో స్థానికేతరుడిని మాడుగులకు తీసుకువచ్చారు. అలాగే పెందుర్తి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న పంచకర్ల రమేష్ బాబు కూడా మచిలీపట్నానికి చెందిన నేత. ఇలా మరో రెండు స్థానాలను కూడా నాన్‌లోకల్స్‌కు టికెట్లు కేటాయించడం ఆ పార్టీ ఆశావహులకు మింగుడు పడడం లేదు.

నోరు మెదపని అయ్యన్న..

బైరా విషయంలో స్థానికేతరుడని ఘాటు విమర్శలు చేసిన అయ్యన్న పాత్రుడు ఇపుడు మాడుగుల, పెందుర్తి టికెట్లు నాన్‌లోకల్స్‌కు కేటాయించినా నోరు మెదపకపోవడం గమనార్హం. నాన్‌లోకల్స్‌ను జిల్లా నుంచి తరిమికొట్టాలని అయ్యన్న ఇచ్చిన పిలుపు.. ఇపుడు ఆ పార్టీ అభ్యర్థులను వెంటాడుతోంది. స్థానికేతర ముద్ర పడకుండా ప్రజల్లోకి ఎలా వెళ్లాలన్న అంశంపై తర్జనభర్జన పడుతున్నారు. తన కొడుకు టికెట్ కోసం అయ్యన్న వేసిన ఎరకు టీడీపీ అభ్యర్థులే చిక్కారంటూ టీడీపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నాన్‌లోకల్ అంశం ప్రజల్లోకి వెళితే ఓటమి తప్పదని ఆందోళన చెందుతున్నారు.

టీడీపీ VS జనసేన

తన్నుకున్నారు

- టీడీపీ కార్యకర్తకు గాయం
- పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌కి చేరిన పంచాయితీ
- టీడీపీ ర్యాలీలో వివాదం


గాయపడిన టీడీపీ కార్యకర్త చిన్నారావు

మధురవాడ: టీడీపీ విశాఖ ఎంపీ, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థుల ఎన్నికల ప్రచార ర్యాలీలో టీడీపీ, జనసేన కార్యకర్తలు తన్నుకున్నారు. ఈ పంచాయితీ పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. తనను కొందరు కొట్టి గాయపరిచారని.. తక్షణమే చర్యలు చేపట్టి న్యాయం చేయాలని జీవీఎంసీ 7వ వార్డు పిలకవానిపాలేనికి చెందిన టీడీపీ కార్యకర్త పీస చిన్నారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. జీవీఎంసీ 6వ వార్డులో టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు పీఎంపాలెం శిల్పారామం జాతర నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలతో ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం వద్దకు చేరే సరికి టీడీపీ, జనసేన కార్యకర్తలకు చెందిన నాలుగు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ఇరు వర్గాల మధ్య నెలకొన్న వాగ్వాదం.. చివరకు కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో టీడీపీ కార్యకర్త పీస చిన్నారావు కంటి పైభాగంలో గాయమైంది. ప్రాథమిక చికిత్స అనంతరం 7వ వార్డుకు చెందిన టీడీపీ ముఖ్య నాయకుడి సహకారంతో చిన్నారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ వివాదం అంతా టీడీపీ ప్రచారం రథం ముందే జరిగింది. ఈ ఘటనలో ఉన్న జనసేన కార్యకర్తలది పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీ కాగా.. టీడీపీ కార్యకర్తలు బక్కన్నపాలెం, పిలకవానిపాలేనికి చెందిన వారుగా తెలిసింది. ఈ వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరినప్పటికీ.. ఇరు పార్టీల నేతలు రాజీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా.. టీడీపీ, జనసేన మధ్య విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. కలిసి ప్రచారాలు నిర్వహిస్తున్నప్పటికీ.. ఒకరికి ఒకరు అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. బీజేపీ నాయకులు అయితే తమను ఎవ్వరూ పిలవడం లేదని, ఒక వేళ పిలిచినా తమకు కనీస ప్రాధాన్యమివ్వడం లేదని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.


ఫిర్యాదు చేయడానికి పీఎంపాలెం స్టేషన్‌కి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

విశాఖ నుంచి వేసవి ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం నుంచి చెన్నై, హతియాలకు వేసవి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

విశాఖపట్నం-చెన్నై ఎగ్మోర్ స్పెషల్స్

విశాఖపట్నం-చెన్నై ఎగ్మోర్ (08557) సమ్మర్ స్పెషల్ ప్రతి శనివారం రాత్రి 7 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.45 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 29 వరకు నడుస్తుంది. చెన్నై ఎగ్మోర్- విశాఖపట్నం(08588) రైలు ప్రతి ఆదివారం ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లో బయల్దేరి అదేరోజు రాత్రి 10.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 30వ తేదీ వరకు నడుస్తుంది.

విశాఖపట్నం-హతియా సమ్మర్ స్పెషల్స్

విశాఖపట్నం-హతియా(08555) సమ్మర్ స్పెషల్ ప్రతి ఆదివారం రాత్రి 11.50 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 2.35 గంటలకు హతియా చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 30వ తేదీ వరకు నడుస్తుంది. హతియా-విశాఖపట్నం (08556) సమ్మర్ స్పెషల్ ప్రతి సోమవారం సాయంత్రం 4గంటలకు హతియాలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.50 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ రైలు జూలై 1వ తేదీ వరకు నడుస్తుంది.

పలురైళ్ల రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల్లో భాగంగా విశాఖ నుంచి, విశాఖ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేశారు.

రద్దయిన రైళ్లు : ◆ గుంటూరు-రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్ మే 26 వరకు, రాయగడ-గుంటూరు(17244) ఎక్స్‌ప్రెస్ మే 27 వరకు, కాకినాడ-విశాఖపట్నం-కాకినాడ(17267/17268) ఎక్స్‌ప్రెస్ మే 26వ తేదీ వరకు రద్దు

దారి మళ్లించిన రైళ్లు : నిడదవోలు-ఏలూరు-విజయవాడ మీదుగా కాకుండా పలు రైళ్లను వయా నిడదవోలు-భీమవరం టౌన్-గుడివాడ-విజయవాడ మీదుగా మళ్లించినట్టు రైల్వే అధికారులు తెలిపారు. ◆ ఈ నెల 29, మే 6, 13, 20వ తేదీల్లో ఎర్నాకుళం-పాట్నా(22643) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ◆ మే 3, 8, 10, 17, 22, 24 తేదీల్లో ఎస్ఎంవీ బెంగళూరు-గౌహతి(12509) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ◆ ఈ నెల 29, మే 1, 3, 4, 6, 8, 10, 11, 13, 15, 17, 18, 20, 22, 24, 25వ తేదీల్లో ముంబయి -భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ◆ మే 26వ తేదీ వరకు ధన్‌బాద్-అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్ ◆ మే 2, 9, 16, 23వ తేదీల్లో టాటానగర్-యశ్వంత్‌పూర్(18111) ఎక్స్‌ప్రెస్ ◆ మే 1, 8, 15, 22వ తేదీల్లో జసిద్ది-తాంబరం(12376) ఎక్స్‌ప్రెస్ ◆ ఈ నెల 29, మే 6, 13, 20వ తేదీల్లో హతియా-ఎర్నాకుళం(22837) ఏసీ ఎక్స్‌ప్రెస్ ◆ మే 4, 11, 18, 25వ తేదీల్లో హతియా-ఎస్ఎంవీ బెంగళూరు(18637) ఎక్స్‌ప్రెస్ ◆ ఈ నెల 30, మే 5, 7, 12, 14, 19, 21, 26వ తేదీల్లో హతియా-ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్ ◆ మే 3, 10, 17, 24వ తేదీల్లో టాటానగర్-ఎస్ఎంవీ బెంగళూరు(12889) ఎక్స్‌ప్రెస్‌లు ఆయా తేదీల్లో మళ్లించిన మార్గంలో నడుస్తాయని అధికారులు తెలిపారు.

ఫెడెక్స్ పేరుతో సైబర్ మోసం

- తైవాన్‌కు పంపించిన కొరియర్‌లో డ్రగ్స్ ఉన్నట్లు వ్యాపారవేత్తకు బెదిరింపు
- బ్యాంకు అకౌంట్ తనిఖీ చేయాలని చెప్పిన మోసగాళ్లు
- అతని అకౌంట్ నుంచి రూ.1.3 కోట్లు కాజేత
- సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు
- బ్యాంకు లావాదేవీల ప్రకారం దర్యాప్తు చేసిన పోలీసులు
- నిందితుల ఖాతాల్లో ఉన్న రూ.85.7లక్షలు హోల్డ్
- చైనా, కాంబోడియా వంటి దేశాల నుంచి ఆపరేట్ చేస్తున్నట్లు గుర్తింపు

విశాఖ సిటీ: ఫెడెక్స్ పేరుతో నగరానికి చెందిన ఓ వ్యాపారవేత్తకు సైబర్ మోసగాళ్లు టోకరా వేశారు. తైవాన్‌కు పంపించిన కొరియర్‌లో డ్రగ్స్ ఉన్నాయని బెదిరించారు. బ్యాంక్ ఖాతా తనిఖీ చేయాలన్న నెపంతో తెలివిగా వారి ఖాతాల్లోకి రూ.1,30,30,639 డబ్బు జమ చేయించుకొని మోసం చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన లాజిస్టిక్స్ వ్యాపారవేత్తకు గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తాము ముంబై ఫెడెక్స్ కొరియర్ నుంచి మాట్లాడుతున్నామని పరిచయం చేసుకున్నారు. ముంబై నుంచి తైవాన్‌కు మీ పేరు మీద బుక్ అయిన పార్సిల్‌లో క్రెడిట్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్, 720 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ ఉన్నట్లు కస్టమ్స్ అధికారులు గుర్తించారని చెప్పారు. అందుకు వ్యాపారవేత్త తాను ఎటువంటి కొరియర్ పంపించలేదని చెప్పగా.. వెంటనే అతని పేరు, ఫోన్‌నెంబర్, అడ్రస్, ఇతర వివరాలు చెప్పడంతో వ్యాపారవేత్త భయాందోళనకు గురయ్యాడు. మీ పేరు మీద ఎఫ్ఐఆర్ నమోదైందని, నార్కోటిక్ పోలీసులకు కాల్ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నామని సైబర్ కేటుగాళ్లు చెప్పారు. విచారణకు ముంబై రావాల్సి ఉంటుందని బెదిరించారు. దీంతో తాను అంత దూరం రాలేనని వ్యాపారి చెప్పగా.. వారు తమపై అధికారికి ఇస్తున్నామని అతనితో మాట్లాడాలని సూచించారు. ఆన్‌లైన్‌లో విచారణ చేస్తామని ఒక స్కైప్ ఐడీ ఇచ్చారు. లాగిన్ అయి వీడియో కాల్ మాట్లాడాలని సూచించారు. బాధితుడు భయంతో రాత్రంతా పడుకోకుండా ఉండిపోయాడు. తర్వాత రోజు బ్యాంక్ అకౌంట్స్ నుంచి మనీ ల్యాండరింగ్, అక్రమ ఆయుధాల రవాణా, టెర్రరిస్టులకు నగదు లావాదేవీలు జరిగాయని భయపెట్టారు. అకౌంట్‌లో ఉన్న డబ్బు తమ ఖాతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేయాలని, ఆర్బీఐ అధికారులు అకౌంట్‌ను తనిఖీ చేసిన తర్వాత ఆ డబ్బు తిరిగి పంపిస్తామని నమ్మించి ఫేక్ ఆర్బీఐ లెటర్ పంపించారు. దీంతో బాధితుడు భయపడి వారు చెప్పిన బ్యాంక్ అకౌంట్‌కు రూ.1,30,30,639 ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత నుంచి వారి నుంచి ఎటువంటి ఫోన్‌కాల్స్ లేవు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే విశాఖ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సైబర్ క్రైం జోన్-2 ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు, అతని బృందం దర్యాప్తు చేపట్టింది. బాధితుడు నగదు బదిలీ చేసిన అకౌంట్ వివరాలు గుర్తించారు. అందులో ఉన్న రూ.85,70,923 నగదును హోల్డ్ చేశారు.

సీపీ అభినందన

డబ్బు ఇతర ఖాతాల్లోకి మళ్లకుండా ముందుగానే గుర్తించిన పోలీసులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అభినందించారు. సైబర్ నేరగాళ్లు చైనా, కాంబోడియా వంటి దేశాల నుంచి నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

పదిలో మెరిసిన 'గురుకులం'

కంచరపాలెం: విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విశాఖ, అనకాపల్లి ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త ఎస్.రూపవతి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 11 గురుకుల పాఠశాలల నుంచి 817 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 770 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. 94.25 శాతం ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేశారని, వీరిలో 136 మంది 500 పైగా మార్కులను సాధించారని తెలిపారు. మేఘాద్రిగెడ్డ గురుకుల పాఠశాల విద్యార్థిని బండారు గంగ 579/600 సాధించి రెండు జిల్లాల్లో ప్రథమ స్థానాన్ని పొందిందిదన్నారు. కొమ్మాది విద్యార్థి వై.అమృత వర్షిణి 572, తాళ్లపాలెం విద్యార్థి కె.మౌనశ్రీ 572, కోనాం విద్యార్థి జె.చరణి 571, దేవరాపల్లి గురుకులం విద్యార్థి కె.వంశీ 562 మార్కులు సాధించారని తెలిపారు. గొలుగొండ గురుకుల పాఠశాల 100 శాతం, మేఘాద్రిగెడ్డ గురుకుల పాఠశాల 98.57 శాతం, దేవరాపల్లి గురుకుల పాఠశాల 98.51 శాతం, కొక్కిరాపల్లి గురుకుల పాఠశాల 97.59 శాతం, కొమ్మాది గురుకుల పాఠశాల 97.2 శాతం, శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాల 95.38 శాతం, నర్సీపట్నం గురుకుల పాఠశాల 93.67 శాతం, నక్కపల్లి గురుకుల పాఠశాల 91.14 శాతం, తాళ్లపాలెం గురుకుల పాఠశాల 88.61 శాతం, సబ్బవరం గురుకుల పాఠశాల 82.86 శాతం సాధించాయని రూపావతి తెలిపారు.

బీజేపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థిపై ఫిర్యాదు


ఆర్వో అఖిలకు ఫిర్యాదు చేస్తున్న కాళిదాస్‌రెడ్డి

సీతమ్మధార: బీజేపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజుపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ నీలాపు కాళిదాస్‌రెడ్డి, లీగల సెల్ మాజీ అధ్యక్షుడు ఇమంది ప్రసాద్ ఆర్వో డి.అఖిలకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుపై విష్ణుకుమార్‌రాజు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి.. అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విష్ణుకుమార్ రాజుపై చర్యలు తీసుకోవాలని ఆమెను తన కార్యాలయంలో మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. కె.కె.రాజుపై విష్ణుకుమార్‌రాజు అభ్యంతర వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎస్.కె.అబ్దుల్ ఖాదర్ కూడా ఆర్వోకు ఫిర్యాదు చేశారు.

విష్ణుకుమార్ రాజు ఆస్తులు రూ.100 కోట్లు

సీతంపేట: విశాఖ ఉత్తర బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెనుమత్స విష్ణుకుమార్‌రాజు చరాస్తులు రూ.2.90 కోట్లు, స్థిరాస్తులు రూ.95.45 కోట్లు, అతని భార్య పేరిట చరాస్తులు రూ.1.49 కోట్లు, స్థిరాస్తులు రూ.22 లక్షలు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే విష్ణుకుమార్‌రాజు పేరిట రూ.5.72 కోట్లు, అతని భార్య పేరిట 1.67 కోట్ల అప్పులున్నాయి. క్రిమినల్ కేసులు లేవు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు 2019లో ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు నమోదైంది.

తెలంగాణ నుంచి పారిపోయి.. విశాఖలో చిక్కి..

హత్య కేసు నిందితులను పట్టుకున్న జీఆర్పీ


నిందితుడితో విశాఖపట్నం జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: తెలంగాణలో జరిగిన ఓ హత్య కేసు నిందితులను విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వివరాలివీ.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఖుర్బాన్ ఆలీ మోల్లా, ఓ మైనర్ గజ్వేల్‌లోని జగ్‌దేవ్‌పూర్‌కు చెందిన మహిపాల్‌రెడ్డి వద్ద కూలి పనులకు చేరారు. ఆదివారం మాటు వేసి.. వీరిద్దరూ యజమానిని హత్య చేశారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, రూ.18 వేలు దొంగలించి హైదరాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో హౌరా పారిపోతున్నట్లు జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ నుంచి అందిన సమాచారంతో ఇక్కడి జీఆర్పీ అప్రమత్తమైంది. ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. జనరల్ బోగీలో సీట్ల కింద దాక్కొన్న వీరిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తెలంగాణ పోలీసులకు అప్పగించారు. తెలంగాణ పోలీసులు వీరిని ఇక్కడ కోర్టులో హాజరుపరచి.. తదుపరి దర్యాప్తు నిమిత్తం ఆ రాష్ట్రానికి తీసుకెళ్లినట్లు గవర్నమెంట్ పోలీసులు వివరించారు. నిందితులను పట్టుకున్న పోలీసులను సిద్దిపేట కమిషనర్ అభినందించారు. ఈ ఆపరేషన్‌లో జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐ ఆర్.గౌరునాయుడు, హెడ్ కానిస్టేబుల్ ఉదయ్‌భాస్కర్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

అంబులెన్స్ ఢీకొని ఇద్దరి మృతి


మృతులు రామకృష్ణ, చంటి

అల్లిపురం: అంబులెన్స్ ఢీ కొని ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మహారాణిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన లూకలపు రామకృష్ణ (19), తన స్నేహితుడు చందు (20)తో కలసి ఈ నెల 22వ తెల్లవారుజామున బైక్‌పై సూర్యాభాగ్, వెంకటేశ్వర థియేటర్ మీదుగా జీవీఎంసీ జోనల్ కార్యాలయం వైపు వెళ్తుతున్నారు. అదే సమయంలో లీలామహల్ పెట్రోల్ బంకు నుంచి జగదాంబ వైపు వస్తున్న 108 అంబులెన్స్ డ్రైవర్ ఎస్.ఈశ్వరరావు బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి ఇద్దరూ కింద పడి.. తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను వెంటనే ఆటోలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందారు. రామకృష్ణ బాబాయి లూకలపు తవుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రామకృష్ణ తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో.. ద్వారకా ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చంటి తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. తల్లి విజయవాడలో ఉంటోంది. చంటి కూడా ఆర్టీసీ కాంప్లెక్స్‌లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ బతుకుతున్నాడు. చంటి తల్లి నిరుపేద కావడంతో ఆమె విజయవాడ నుంచి విశాఖ రావడానికి పోలీసులు ఆర్థిక సాయం చేశారు. ఆమె మంగళవారం విశాఖ వచ్చారు. మృతదేహాలకు మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు సహకరించండి

స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ లక్ష్యాలను చేరుకోవడంలో అధికార యంత్రాంగానికి, ఓటర్లకు సహకరించాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను జాయింట్ కలెక్టర్, తూర్పు నియోజకవర్గ ఆర్వో కె.మయూర్ అశోక్ కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం వారందరితో ఆయన ప్రత్యేకంగా సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. జేసీ మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఓటర్లు ఉత్సాహం చూపడం లేదని, వారిని ప్రోత్సహించి తప్పకుండా ఓటు వేసేలా ఎన్‌జీవోలు కీలక పాత్ర పోషించాలన్నారు. పోలింగ్ రోజున కేంద్రాల వద్ద ఓటర్ల కోసం అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఎన్‌జీవోలు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కొత్తగా ఓటు పొందిన యువతను ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తూర్పు ప్రాంతంలో మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఓటర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగస్వామ్యం కావాలని చెప్పారు. 85 ఏళ్లు దాటిన వారికి హోం ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించాలన్నారు. సెల్ఫీ పాయింట్లు, ఫ్లాష్ మాబ్ కార్యక్రమాల ద్వారా యువ ఓటర్లలో చైతన్యం కల్పించేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎన్‌జీవోల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు జేసీ సమాధానాలిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో తూర్పు నియోజకవర్గ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.